సాక్షి
వికారాబాద్

మంగళవారం, 12, సెప్టెంబర్, 2023



ఉద్యోగ భద్రత కల్పించాలి

15ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగులు కోరారు. 8లో▸



తప్పిన ముప్పు

ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఓ ప్రైవేటు పాఠశాల బస్సు మిషన్ భగీరథ ఎయిర్ పంప్‌ను ఢీకొట్టింది. 8లో▸



బడిలో 'విజ్ఞాన' గోడలు

ప్రభుత్వ పాఠశాల గోడలపై విజ్ఞానాన్ని పంచే చిత్రాలు ఏర్పాటు చేయడం విద్యార్థులను ఎంతగానో అకట్టుకుంటోంది. 9లో▸

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని జిల్లా ఎంప్లాయ్మెంట్ కార్యాలయంలో 13వ తేదీ ఉదయం 10:30 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 150 ఉద్యోగాల కోసం అపోలో ఫార్మసీ ప్రైవేట్ కంపెనీ వారు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫార్మసీ కోర్సులతోపాటు, డిగ్రీ, ఇంటర్, పదో తరగతి విద్యార్హత ఉన్న వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సెల్‌నంబర్ 96760 47444లో సంప్రదించాలని సూచించారు.

విదేశీ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: మహాత్మ జ్యోతిబాపూలే విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 – 24 విద్యా సంవత్సరానికి గాను బీసీ విద్యార్థులు విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 30లోగా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఇంజనీరింగ్, వైద్యం, సైన్స్, మేనేజ్‌మెంట్, వ్యవసాయం, నర్సింగ్, సామాజిక శాస్త్రం(డిగ్రీ)లో 60శాతం మార్కులు సాధించిన 35 సంవత్సరాల లోపు వారు మాత్రమే అర్హులని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 5 లక్షల లోపు ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ పరిశీలించి అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రెండు విడతల్లో వారు ఎంపిక చేసుకున్న యూనివర్సిటీ నిర్ణయించిన ఫీజును స్కాలర్‌షిప్ రూపంలో మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు

సమ్మె విరమించి విధుల్లో చేరండి

అంగన్‌వాడీలకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సూచన




అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న లలితకుమారి

వికారాబాద్ అర్బన్: నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఆందోళన విరమించి విధుల్లో చేరాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలిత కుమారి సూచించారు. పట్టణంలో అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించి వారితో మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించే అవకాశం ఉన్నందున సమ్మె విరమించాలని కోరారు. సిబ్బంది సమస్యలను మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

10లక్షల మందితో తుక్కుగూడ సభ

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్



సమావేశంలో ప్రసాద్‌కుమార్, టీఆర్ఆర్

అనంతగిరి: ఈనెల 17న తుక్కుగూడ శివారులో నిర్వహించే కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాంమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ప్రసాద్‌కుమార్ నివాసంలో వారు మాట్లాడుతూ.. దాదాపు 10లక్షల మందితో నిర్వహించే బహిరంగ సభకు కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, వస్తున్నారన్నారు. జిల్లా నుంచి నాయకులు పెద్దఎత్తున తరలిరావాలని వారు కోరారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు.. శంకర్, నర్సింగ్‌నాయక్, రవీందర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కళాశాలలు, పాఠశాలల్లో అతిథి అధ్యాపకులుగా బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని బీసీ గురుకుల రీజనల్ కోఆర్డినేటర్‌యాదయ్యగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘికశాస్త్రం, ఆంగ్లం, గణితశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా సమీప బీసీ గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



అడవులు హాంఫట్

యథేచ్ఛగా అటవీ భూముల ఆక్రమణ

- జిల్లాలో 1,08,000 ఎకరాల్లో అడవులు
- 25 శాతానికి పైగా అన్యాక్రాంతం
- అడ్డుకునే అధికారులపై బదిలీ వేటు
- అక్రమార్కులతో ప్రజాప్రతినిధుల కుమ్మక్కు

వికారాబాద్: జిల్లాలో అటవీ భూముల ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మానవ మనుగడకు ఆధారమైన అడవులు నేడు ప్రమాదపుటంచుల్లోకి వెళ్లాయి. రోజురోజుకూ ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అడవులను ఆక్రమించుకుంటున్న రియల్టర్లు, క్వారీల నిర్వాహకులు, రిసార్టు యజమానులు యథేచ్ఛగా అక్రమ దందా సాగిస్తున్నారు. ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్న అధికారులపై బదిలీ వేటు పడుతోంది. ప్రజా ప్రతినిధులు సైతం కుమ్మక్కు అవుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లాలో 1,08,000 ఎకరాల అటవీ భూమి ఉంది. అందులో 25 శాతానికి పైగా అంటే సుమారు 31 వేల ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు ఆ శాఖ అధికారులే అంటున్నారు. జిల్లాలో 94 ఫారెస్టు బ్లాకులు ఉండగా వాటిలోని కొన్ని ఏరియాలు మొత్తం కబ్జా కోరల్లోకి వెళ్లి పోయాయి. మరికొన్ని చోట్ల 50 శాతం నుంచి 90 శాతం వరకు కబ్జాలకు గురైనట్లు తెలిసింది. గతంలో అటవీ భూములను కేవలం పోడు రూపంలో సాగు చేసుకునే వారు. జిల్లా భౌగోళికంగా 13 శాతం మాత్రమే అడవులు ఉన్నాయి. ఇందులో 9 శాతం గ్రీనరీ అంటే 15వేల ఎకరాల్లో దట్టమైన అడవులు ఉన్నాయి. మన చుట్టుపక్కల జిల్లాల్లో ఇదే అత్యధిక శాతం అడవి కావడం గమనార్హం. ఈ అటవీ ప్రాంతాన్ని ఐదు క్లస్టర్లుగా, 94 బ్లాకులుగా విభజించారు. ఇందులో అనంతగిరి ప్రాంత అడవి ముఖ్యమైనదిగా చెబుతారు. కుల్కచర్ల, చించోలి అటవీ ప్రాంతంలో చిరుతల సంచారం ఉంది. అనంతగిరిలో హైనాలు, దుప్పులు, దున్నలు, కొండ గొర్రెలు వంటివి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఓ పక్క ప్రభుత్వం హరితహారం పేరిట అడవులను పెంచేందుకు కృషి చేస్తోంది. మరో పక్క ధనార్జనే లక్ష్యం కొందరు అడవులను యథేచ్ఛగా నరికేస్తున్నారు.

అడ్డుకునే అధికారులపై బదిలీ వేటు

కొద్ది రోజుల క్రితం వరకు జిల్లాలో విధులు నిర్వహించిన డీఎఫ్ఓ కబ్జారాయుళ్ల విషయంలో కఠినంగా వ్యవహరించారు. చర్యలకు ఉపక్రమించిన ఐదు నెలల్లోనే ఆయనపై బదిలీ వేటు పడింది. వికారాబాద్ రేంజ్ అటవీ భూముల్లో అక్రమంగా రెండు క్వారీలు నిర్వహిస్తున్నట్లు ఆ అధికారి గుర్తించారు. ఒక చోట రూ. 160 కోట్లు, మరో చోట 60 కోట్ల విలువైన ఖనిజాన్ని కొల్లగొట్టారని తేల్చాడు. అంతేకాకుండా అక్రమార్కులపై కోర్టులో కౌంటర్ కూడా దాఖలు చేశారు. తాండూరు ఫారెస్టు రేంజ్‌లోని ఓ క్వారీలో సైతం రూ. 60 కోట్ల విలువైన ఖనిజ సంపద కొల్లగొట్టారని గుర్తించి కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. దుద్యాల ఫారెస్టు పరిధిలోని ఓ క్వారీలో సైతం అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని నోటీసులు జారీ చేశారు. జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న 10 స్వా మిల్లులను సీజ్ చేశారు. అనుమతి లేకుండా కలప వినియోగిస్తున్న ఓ ప్లై ఉడ్ కంపెనీకి రూ. 5లక్షల జరిమానా విధించారు. అనంతగిరి సమీపంలో ఫారెస్టు భూమిని ఆక్రమించిన ఓ రిసార్ట్ యజమానికి నోటీసులు ఇవ్వడంతో పాటు కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. పూడూరు మండలం దామగుండం సమీపంలో ఫారెస్టు భూమిలో రిసార్ట్ ఏర్పాటు చేయడంతో వారికి నోటీసులు ఇచ్చారు. కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ఐదు నెలల కాలంలోనే ఆ అధికారి ఇదంతా చేయడంతో అక్రమార్కుల ఆటలు సాగక క్వారీల యజమానులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఆయన్ను బదిలీపై చేయించి వారి పంతం నెగ్గించుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అడవుల సంరక్షణపై దృష్టి సారించాలని జిల్లా వాసులు కోరుకుంటున్నారు.

మహనీయులే ఆదర్శం

- సబ్బండ వర్గాల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి
- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి
- కుల్కచర్లలో పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

కుల్కచర్ల: మహనీయులే మనకు ఆదర్శమని, వారి ఆశయ సాధనకు కృషి చేద్దామని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కుల్కచర్లలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మహనీయుల పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని సూచించారు. గౌడ ప్రజల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.130కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. మద్యం దుకాణాల కేటాయింపులో 15శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు తెలిపారు. గౌడ సంఘం నేతలు రిజర్వేషన్లు పెంచాలని కోరుతున్నారని, ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మంత్రి తెలిపారు. గౌడ సంఘం భవన నిర్మాణానికి రూ. 10లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గౌడ సంఘం భవన నిర్మాణానికి 10గుంటల భూమి, రూ.20లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనే లక్ష్యంగా అందరూ కలసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, రాష్ట్ర విద్యామౌలిక వసతుల కల్పన మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న గౌడ్, ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, వైస్ ఎంపీపీ రాజశేఖర్ గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్

- ఆర్డీఓ విజయకుమారి

పరిగి: రాఘవపూర్‌లోని సర్వే నంబర్ 95,96లో ఉన్న 22.02 ఎకరాల భూమిని నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్ చేశామని ఆర్డీఓ విజయకుమారి సోమవారం ఒక ప్రటకలో పేర్కొన్నారు. రికార్డులను సక్రమంగా పరిశీలించిన అనంతరం ధరణి పీఓపీ నుంచి తొలగించడమైందని తెలిపారు. పట్టాదారులు కొనుగోలు దారుల స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేశామని, దీనిపై ఎలాంటి ఒప్పందం జరిగినా, ఎటువంటి విభేదాలు ఉన్నా సివిల్ కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. దీనిపై కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, అవన్నీ అవాస్తవమని కొట్టిపారేశారు. అసత్య ప్రచారం చేస్తున్నవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రారంభోత్సవానికి తరలిరండి



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

- రైతులకు సూచించిన కలెక్టర్ నారాయణరెడ్డి
- 'పాలమూరు' ఎత్తిపోతల పథకం ఇనాగిరేషన్‌కు 134 బస్సులు
- ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం

వికారాబాద్ అర్బన్: ఈ నెల 16న పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను సీఎం కేసీఆర్ ప్రారంభిస్తున్నందున జిల్లా నుంచి రైతులు భారీగా తరలిరావాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాలో దాదాపు 5 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లాకు 134 బస్సులు కేటాయించడం జరిగిందని, నాలుగు నియోజకవర్గాల నుంచి రైతులను పెద్ద ఎత్తున తరలించాలని సూచించారు. పూర్తి బాధ్యతలు వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టాలని ఆదేశించారు. ప్రాజెక్టు ద్వారా విడుదల చేసిన కృష్ణా జలాలను కలశాలతో తెచ్చి మరుసటి రోజు ఆలయాల్లోని విగ్రహాలను ఆ నీటితో శుద్ధి చేయనున్నట్లు తెలిపారు. అలాగే వికారాబాద్‌కు మంజూరైన వైద్య కళాశాలను ఈ నెల 15న వర్చువల్‌గా సీఎం ప్రారంభిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ముఖ్య అతిథులను ఆహ్వానించాలని, అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 177 ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమితు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోషణ మాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పోషణ మాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో పోషణ సంబరాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..నెల రోజులపాటు గర్భిణులు, బాలింతలు, శిశువులు, దివ్యాంగులు, వయోవృద్ధులకు పోషకాహారం పంపిణీ చేయడంతోపాటు తాగు నీరు, పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కేతావత్ లలితకుమారి పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం

అనంతగిరి: జిల్లాలో కొత్త ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు నమోదు ప్రక్రియ, మార్పులు, డబుల్ ఓట్లు, చనిపోయిన వ్యక్తుల ఓట్లు తొలగించడంపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఓటు హక్కు పొందడం, వినియోగంపై ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, ఆర్డీఓలు విజయ కుమారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలవరపెడుతున్న డెంగీ

- నెలరోజుల వ్యవధిలో 20 మందికి పాజిటివ్
- అనధికారికంగా 150 నుంచి 200 కేసులు ఉండే అవకాశం

వికారాబాద్ అర్బన్: జిల్లా వాసులను డెంగీ జ్వరం కలవరపెడుతోంది. వరుస వర్షాలకు ఎక్కడికక్కడ వరద, మురుగు నీరు నిలవడంతో డెంగీ దోమలు వృద్ధి చెందుతున్నాయి. జిల్లాలో నెల రోజుల వ్యవధిలో 20 డెంగీ కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి తోడు మలేరియా, డయేరియా ఇతర అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. కొన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగీ జ్వరానికి వైద్యం అందుతున్నా, చాలా మంది ప్రైవేటు క్లీనిక్‌లను ఆశ్రయిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 20 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అయితే ప్రైవేటుగా వైద్యం చేయించుకుంటున్న వారి సంఖ్య 150 నుంచి 200 వరకు ఉండే అవకాశం ఉంది.

జిల్లాలో డెంగీ కేసులు		
తాండూరు	-	09
పరిగి	-	06
కొడంగల్	-	04
సిద్దులూర్‌లో	-	01

విజృంభిస్తున్న డెంగీ

జిల్లాలో డెంగీ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గత ఏడాది ఆగస్టు చివరి వారంలో ఏకంగా 56కేసులు నమోదయ్యాయి. ఇప్పుడదే పరిస్థితి కనిపిస్తోందని కొందరు వైద్య అధికారులు చెబుతున్నారు. డెంగీ బారిన పడిన చాలా మంది మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళుతున్నట్లు సమాచారం. జిల్లాలో ఇప్పటి వరకు 271మంది నుంచి నమూనాలు సేకరించగా 20 మందికి డెంగీగా తేలింది. చికెన్‌గున్య లక్షణాలు ఉన్న చాలా మంది ప్రైవేటు క్లీనిక్‌ల బాట పట్టారు.

ప్రైవేటులో డెంగ్యూ పరీక్షలు చేయరాదు

అరకొర పరీక్షలతో డెంగ్యూ సోకిందని ప్రైవేటు ఆస్పత్రులు, క్లీనిక్‌ల నిర్వాహకులు చెప్పే మాటలను నమ్మవద్దని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల వారు డెంగీ నిర్ధారణ చేయరాదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా వారు పట్టించుకోవడం లేదు. డెంగీ లక్షణాలు ఉంటే నమూనాలను తాండూరు జిల్లా ఆస్పత్రి, లేదా వికారాబాద్ ఏరియా ఆస్పత్రికి పంపాలని చెబుతున్నారు. ఈ రెండు చోట్ల మాత్రమే డెంగీ పరీక్షలకు అన్ని వసతులు ఉన్నాయని జిల్లా వైద్యాధికారులు తెలిపారు.



వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

విజృంభిస్తున్న డయేరియా

తాండూరు: నియోజకవర్గంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. గడిచిన 15 రోజుల్లో తాండూరు జిల్లా ఆస్పత్రికి సుమారు 400 కేసులు నమోదు కాగా.. పీహెచ్‌సీలు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మరో 600కు పైగా కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా డయేరియా బాధితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. వర్షాలు ప్రారంభమైన నాటి నుంచి తాగునీటి ట్యాంకులు, బావులను క్లోరినేషన్ చేయలేదు. దీనికి తోడు వైద్యఆరోగ్య, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల మధ్య సమన్వయం లోపించడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. తాగునీరు కలుషితం కావడం వల్ల ప్రజలు విష జ్వరాలు, డయేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామాల్లో తాగు నీటి పైప్‌లైన్లు లీకేజీలు కావడం, వాటిలోకి మురుగు నీరు చేరడంతో వాటిని తాగిన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. తాండూరు పట్టణంలో మిషన్ భగీరథ పథకం తాగునీటి సరఫరా అధ్వానంగా మారింది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తాండూరు జిల్లా ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. నిత్యం పదుల సంఖ్యలో డయేరియా కేసులు వస్తున్నాయి. ప్రతి రోజూ 100నుంచి 130 మంది వరకు రక్త పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ పరీక్షల్లో ప్రధానంగా టైఫాయిడ్, డెంగీ, పచ్చకామెర్ల వ్యాధులు బయట పడుతున్నాయి. మున్సిపల్ పరిధిలోని రెండు బస్తీ దవాఖనాలకు నిత్యం పెద్ద సంఖ్యలో రోగులు వస్తున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కేవీఎస్ మూర్తి సూచించారు. వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవడం, కాచి వడబోసిన నీటిని తాగాలన్నారు.

శ్రావణ శోభ



అనంతగిరి: కల్యాణ శోభిత శివపార్వతులు

శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతి పరమేశ్వరుల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. తాండూరు పట్టణంలోని భావిగి భద్రేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



తాండూరు టౌన్: భావిగ భద్రేశ్వర స్వామి

క్లుప్తంగా

వినాయక ఉత్సవాలకు రూ.3 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: వినాయకచవితి ఉత్సవాలను పురస్కరించుకుని తాండూరులోని హిందూ ఉత్సవ కేంద్ర సమితికి.. ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి రూ.3,06,000 విరాళం అందజేశారు. సోమవారం హిందూ ఉత్సవ కేంద్ర సమితి తాండూరు ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులుకు విరాళం నగదును అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్, కిరణ్, ఆసిఫ్, నర్సింహ, నరేష్, వినోద్, గోపాల్, సమితి సభ్యులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పరిగి: సీలింగ్ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకులు సోమవారం పరిగి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. రాఘవాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 94, 95, 96లోని 23.23 ఎకరాల భూమి సీలింగ్ భూమి అని దీనిని కొందరు అధికారులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. అవి సీలింగ్ భూములని తమ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. వెంటనే రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్తయ్య, రఘురాం, రమేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ లారీ బోల్తా



ఎబ్బనూర్ చెరువు వద్ద బోల్తాపడిన లారీ

ధారూరు: తాండూర్ నుంచి హైదరాబాద్‌కు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన మండల పరిధిలోని ఎబ్బనూర్ చెరువు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. అతివేగమే ప్రమాదానికి కారణమని ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. లారీ డ్రైవర్ యాసీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ఇద్దరి అదృశ్యం



సత్తమ్మ (ఫైల్)



నర్సింహులు (ఫైల్)

పూడూరు: మండల పరిధిలోని చెంచుపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల సత్తమ్మ(42) గతనెల 30న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఈ మేరకు భర్త ఎర్రోళ్ల అంతయ్య సోమవారం చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భర్త అంతయ్య మాట్లాడుతూ.. తన భార్య ఇలా తరచూ ఇంటినుంచి వెళ్లిపోయి తిరిగివచ్చేదని.. అయితే ఈసారి పదిరోజులు గడిచినా తిరిగిరాకపోవడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేశానన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

మరో సంఘటనలో..

మండల పరిధిలోని మంచన్‌పల్లి గ్రామానికి చెందిన సందిగారి నర్సింహులు (75) శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఎంతవెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి కుమారుడు సందిగారి సాయన్న సోమవారం చన్గోముల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

- ఏడాదిగా 104 ఉద్యోగుల ఎదురుచూపు
- 15 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు



ఇటీవల ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

కొడంగల్ రూరల్: 15ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తోన్న 104 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు కోరుతున్నారు. కరోనా మహమ్మారి మూడు వేవ్‌లలో క్షేత్రస్థాయిలో ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్య సేవలందించిన తమను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2008 ఏడాదిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో డీఎస్సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ పద్ధతిలో జీఓ నంబర్ 1636, మెమో నంబర్ 20639 ప్రకారం తాము ఉద్యోగాల్లో చేరామని తెలిపారు. అప్పటి నుంచి పూర్తిగా ప్రభుత్వాధీనంలోనే విధులు నిర్వహిస్తున్నా.. ఏజన్సీల ద్వారానే వేతనాలు అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 15ఏళ్లుగా ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా, చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.

అమలుకు నోచుకోని హామీలు..

2008 నుంచి 2022(అక్టోబర్ 29) వరకు క్షేత్రస్థాయిలో దీర్ఘకాలిక రోగులకు నెలలో ఒకరోజు వారి గ్రామాలకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ మందులను అందించేవారు. తదనంతరం ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇస్తూ 104 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో, టీహబ్ సెంటర్లలో 104 ఉద్యోగులను అడ్జస్ట్‌మెంట్ చేశారు. వాహనాలను కూడా పీహెచ్‌సీల్లోనే ఉంచేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చి దాదాపు ఏడాది కావస్తున్నా ఇప్పటివరకు పర్మనెంట్ విషయంలో ఎలాంటి పురోగతి లేదని ఉద్యోగులు వాపోతున్నారు. జీఓ నంబర్ 60 ప్రకారం ఉద్యోగులకు స్లాబ్ పద్ధతిన వేతనాలు చెల్లిస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని అంటున్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తూ ఏజన్సీ విధానాన్ని రద్దుచేసి ఉద్యోగుల ఖాతాలో ట్రెజరీ ద్వారా వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమాన వేతనం ఇవ్వాలి..

104 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని.. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగులకు చెల్లించే వేతనాలు ట్రెజరీ ద్వారానే అందించాలని.. హెల్త్‌కార్డు లేదా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, 35 క్యాజువల్ లీవ్‌లతోపాటు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్నిరకాల సెలవులు అమలు చేయాలని కోరుతున్నారు.

పర్మినెంట్ చేయాలి



15 ఏళ్లుగా క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య సేవలందిస్తున్నాం. కరోనా మహమ్మారి సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించాం. స్థానిక ఎమ్మెల్యే, నాయకులకు ఇదివరకే మా సమస్యలను చెప్పాం. ప్రభుత్వం వెంటనే మా ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి.

– శ్రీనివాస్, 104 ఫార్మాసిస్టు, జిల్లా ఉపాధ్యక్షుడు

వైభవంగా రామలింగేశ్వర జాతర



కుల్కచర్ల: స్వామివారి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు

- పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజలు చేసిన ప్రముఖులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గ్రామ శివారులో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర సోమవారం వైభవంగా సాగింది. శ్రావణ మాసం ఆఖరి సోమవారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌గౌడ్, నాయకులు రాంలింగారెడ్డి, రఘు కిషోర్, అజ్మత్, కళ్యాణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి..

పూడూరు: దామగుండ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శ్రావణమాసం ఆఖరి సోమవారం కావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, డీసీసీ కార్యదర్శి పెంటయ్య, మండల అధ్యక్షుడు సురేందర్, పాండు తదితరులు పాల్గొన్నారు.

బండవెల్కిచర్ల గ్రామంలో..

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో సోమవారం స్వామి ఉత్సవాల(చిన్న జాతర)ను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ సుధాకర్, మాజీ చైర్మన్ రాములు, జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, స్థానిక ఎంపీటీసీ జ్యోతిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబురామేశ్వర ఆలయంలో..

పెద్దేముల్: పెద్దేముల్ మండల తట్టెపల్లి అంబురామేశ్వర దేవాలయంలో సోమవారంఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని అంబురామేశ్వర జాతరకు నెలరోజుల పాటు ఉపవాస దీక్షతో ఉన్న భక్తులు.. పూజలు, అభిషేకాలు చేసి దీక్షలు ముగించారు.

బహిరంగ సభకు తరలిరండి

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్



సమావేశంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

మర్పల్లి: మర్పల్లిలో ఈనెల 16న నిర్వహించే బీఎస్పీ (బహుజన సమాజ్ పార్టీ) బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గండు రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో సోమవారం మర్పల్లి, బంట్వారం, మోమిన్‌పేట్, కోట్‌పల్లి మండలాలకు చెందిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల రాజ్యాధికారం కోసం నిర్వహించే ఇట్టి సభకు పార్టీలకతీతంగా అన్నివర్గాల ప్రజలు తరలిరావాలన్నారు. బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు శ్రీరాంజీ గౌతమ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు ఈ సభకు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ఈసీ మెంబర్ అభిషేక్, జిల్లా మైనార్టీ కోకన్వీనర్ ఆమీర్, మండల ఉపాధ్యక్షులు రాజు, హర్షవర్ధన్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కార్యదర్శి మస్తాన్, బంట్వారం మండల అధ్యక్షుడు సయ్యద్ బాబా, కోట్‌పల్లి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, ఆర్గనైజర్లు విజయ్, శ్రీను, ప్రేమ్‌కుమార్, సంపత్, ఉదయ్ పాల్గొన్నారు.

తప్పిన ముప్పు

- ప్రమాదానికి గురైన ప్రైవేట్ స్కూల్ బస్
- డ్రైవర్, ఓ విద్యార్థినికి స్వల్ప గాయాలు
- మిగిలినవారంతా సురక్షితం

మోమిన్‌పేట: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పిన ప్రైవేటు పాఠశాల బస్సు మిషన్ భగీరథ ఎయిర్ పంప్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు ఓ విద్యార్థినికి స్వల్ప గాయాలయ్యాయి. మోమిన్‌పేటలో సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని వింటేజ్ సెంట్రల్ స్కూల్‌కు చెందిన ఏపీ28వై 0368 నంబరు గల బస్సు.. స్కూల్ వదిలిన తర్వాత 23 మంది విద్యార్థులతో బయలుదేరింది. వెల్‌చాల్ గ్రామంలో 15 మందిని దింపేసి.. ఎనిమిది మందితో గోవిందాపూర్, మల్‌రెడ్డిగూడకు వెళ్తోంది. ఈ క్రమంలో మోమిన్‌పేట రాయల్ ఫంక్షన్ హాల్ వద్ద ఎడమ వైపు నుంచి కుడివైపునకు రోడ్డు దిగి భగీరథ ఎయిర్ పంపును ఢీ కొట్టింది. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. బస్సు ముందుభాగంలోని అద్దం ధ్వంసమైంది. విద్యార్థులను దింపి ఆటోలో ఇళ్లకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో బస్సు అదుపుతప్పిందని, బ్రేకులు రాకపోవడంతో రోడ్డు కిందకు వెళ్లిందని డ్రైవర్ రాంచంద్రయ్య తెలిపారు. ఘటన విషయమై స్కూల్‌కు సమాచారం ఇవ్వడంతో ఆటో పంపించారన్నారు. విద్యార్థులను అందులో ఎక్కించి ఇళ్లకు పంపించానని చెప్పారు. పగిలిన అద్దం ముక్కలు తగిలి.. తన చేతికి, మరో విద్యార్థినికి చిన్నపాటి గాయాలయ్యాయన్నారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నామని చెప్పారు.

గతంలోనే బస్ సీజ్

ప్రమాదానికి గురైన బస్సుకు ఫిట్‌నెస్ లేని కారణంగా ఆర్టీఓ సీజ్ చేశారు. దీంతో ఏడాది పాటు మోమిన్‌పేట పీఎస్ ఆవరణలోనే ఉంది. ఇటీవలే బయటకు రావడంతో విద్యార్థులను తరలిస్తున్నారు. కానీ బస్సుకు ఫిట్‌నెస్ చేయించారా.. లేదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మోమిన్‌పేటలో ప్రమాదానికి గురైన పాఠశాల బస్సు

తల్లిదండ్రుల టెన్షన్..

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో వికారాబాద్ నుంచి హుటాహుటిన ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎవరికీ ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నాయి. యాక్సిడెంట్ విషయం తెలియడంతో తల్లిదండ్రులు టెన్షన్‌కు గురయ్యారు. అందుబాటులో ఉన్నవారు ద్విచక్ర వాహనాలపై అక్కడకు వెళ్లారు. పిల్లలను చూసుకుని ఊపిరి పీల్చుకున్నారు.

విక్రయాల్లో పారదర్శకత పాటించాలి

- ఏడీఏ శంకర్ రాథోడ్
- ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

కొడంగల్: ఎరువుల విక్రయాల్లో పారదర్శకత పాటించాలని కొడంగల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు(ఏడీఏ) శంకర్ రాథోడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. విక్రయదారులకు సలహాలు సూచనలు చేశారు. ఈపాస్ మిషన్ ద్వారా మాత్రమే రైతుల ఆధార్ వివరాలను నమోదు చేసి ఎరువులను విక్రయించాలన్నారు. వరి, పత్తి పంటలకు యూరియా అవసరం ఉన్నందున డీలర్లు సరైన మోతాదులో ఎరువులను సరఫరా చేయాలన్నారు. కొడంగల్ డివిజన్ పరిధిలో రైతులకు సరిపడా యూరియా ఉందని తెలిపారు. డీలర్లు ఎరువులను విక్రయించకుండా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియోజకవర్గంలోని అన్ని దుకాణాల్లో 150 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాజు, సీనియర్ అసిస్టెంట్ జైవర్ధన్, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

సహాయ ట్రైనీ కలెక్టర్ నారాయణ



మాట్లాడుతున్న నారాయణ అమిత్

పరిగి: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని సహాయ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పట్టణ కేంద్రంలోని పల్లవి డిగ్రీ కళాశాలలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని వారు ఫామ్–6 ద్వారా ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వీప్ యాక్టివిటీ కోఆర్డినేటర్ కోటాజీ, ఆర్డీఓ విజయకుమారి, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠాపన

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని పెద్ద నందిగామ గ్రామంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.మూడోరోజైనసోమవారం గ్రామంలోని మూడు ప్రాంతాల్లో బొడ్రాయి ప్రతిష్ఠాపన, గ్రామంలోని శివాలయం, ఆంజనేయ స్వామివార్ల ఆలయాల ఆవరణల్లో నవగ్రహ, నాగులు ప్రతిష్ఠాపన చేశారు. ప్రత్యేకపూజాకార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కర్ణాటక రాష్ట్రంలోని జకన్‌పల్లి మఠాధిపతులు శ్రీగవి సిద్ధలింగేశ్వర స్వామివారు భక్తులకు ఆశీర్వచనాలు అందించారు.

గొర్రెల పంపిణీలో అక్రమాలు: యాదవ సంఘం

బొంరాస్‌పేట: రెండో విడత గొర్రెల పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని తాలూకా యాదవసంఘం అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం దుద్యాల మండలం పోలెపల్లిలో 11 మంది లబ్ధిదారులకు పశుసంవర్ధక శాఖ ఏడీ సుదర్శన్ ఆధ్వర్యంలో గొర్రెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బస్వరాజ్ మాట్లాడారు. యూనిట్ల పంపిణీలో బనగానపల్లెలో దళారులు, అధికారులు కుమ్మక్కై లబ్ధిదారులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ, వీటిని అరికట్టాలని ఏడీకి కోరారు.



ఉప్పొంగిన 'శివసాగర్'

యాలాల మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ సమీపంలోని కాక్రవేణి నదిపై నిర్మాణంలో ఉన్న శివసాగర్ ప్రాజెక్టు అలుగు సోమవారం ఉధృతంగా ప్రవహించింది. ఆదివారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురుస్తుండటంతో కాకర, కాగ్నా నదులకు వరదనీరు పోటెత్తింది. దీనికితోడు ఎగువన ఉన్న బొంరాస్‌పేట మండలంలో భారీ వర్షం పడటంతో వరదనీరంతా దిగువన ఉన్న శివసాగర్ ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. అలుగు ఉధృతంగా ప్రవహించడంతో దిగువన గోవిందరావుపేట చెక్‌డ్యాం సైతం ఉప్పొంగి ప్రవహించింది.

– యాలాల

శభాష్.. రాజ్‌కుమార్

జ్యోతిబాపూలే జాతీయ అవార్డుకు ఎంపిక



రాజ్‌కుమార్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ప్రతినిధులు

తాండూరు టౌన్: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అందించే మహాత్మా జ్యోతిబాపూలే జాతీయ అవార్డు ఈఏడాది తాండూరు పట్టణానికి చెందిన బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్‌ను వరించింది. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లో అకాడమీ సభ్యులు అవార్డుకు ఎంపికైన రాజ్‌కుమార్‌కు ఆహ్వానపత్రం అందజేశారు. ఈసందర్భంగా అవార్డు సెలక్షన్ కమిటీ జాతీయ చైర్మన్ నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బహుజన సాహిత్య అకాడమీ కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగా బహుజనుల అభ్యున్నతికి దోహదపడుతున్న వారికి ప్రతీఏటా మహాత్మా జ్యోతిబా పూలే జాతీయ అవార్డును అందజేస్తున్నట్లు చెప్పారు. బీసీల హక్కుల కోసం, కులవృత్తుల పక్షాన నిలిచి పోరాడుతున్న రాజ్‌కుమార్‌కు 2023 సంవత్సరానికి గాను ఈ అవార్డును అందజేయనున్నట్లు చెప్పారు. నవంబర్ 15న ఢిల్లీలో జరుగనున్న ఆలిండియా బహుజన రైటర్స్ 4వ నేషనల్ కాన్ఫరెన్స్ సమావేశంలో ఆయనకు అవార్డు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. జాతీయ అవార్డుకు ఎన్నికైనందుకు ఎంతో సంతోషంగా ఉందని అవార్డు గ్రహీత రాజ్‌కుమార్ అన్నారు. అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కులవృత్తులకు సబ్సిడీ రుణాలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



జ్యోతి ప్రజ్వలన చేసి అష్టావధానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: కులవృత్తుల వారికి చేయూతనందిస్తూ ప్రభుత్వం గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొత్తూరు మండల కొడిచెర్ల గ్రామానికి చెందిన వివిధ నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టామన్నారు.

ద్విగళ అష్టావధానం

పట్టణంలోని ఠాగూర్ పాఠశాల ఆవరణలో ఉన్న రంగరాయ ఆడిటోరియంలో శ్రీ కళామంజరి ఆధ్వర్యంలో నిర్వహించిన ద్విగళ అష్టావధానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. ఉభయ కళాతపస్వి సుసరావు చంద్రశేఖర్ శర్మ, రంప సాయికుమార్ శర్మలు అష్టావధానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవధాన కళానిధి మురళి, సాహిత్యరత్న బ్రహ్మ శ్రీ బంకుపల్లి రమేశ్‌శర్మ, విజయ్‌కుమార్, శంకరశర్మ, సాకేత్ ప్రవీణ్, రవీంద్రాచారి, వీరబ్రహ్మేంద్రచార్య, లక్ష్మీ మానస, రవిప్రకాష్ హర్మాశ్, లక్ష్మీకాంతరావు, డాక్టర్ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

పరిగి: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం పరిగి పట్టణ కేంద్రంలో ఈమేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ సిబ్బంది జీతాలను పెంచాలని కోరారు. వెంటనే అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి..

అనంతగిరి: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి భారతి డిమాండ్ చేశారు. ఈమేరకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వికారాబాద్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్ష సోమవారం కొనసాగింది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. సమ్మెకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మద్దతు తెలిపారు.



పరిగి: సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది

ఫొటోషూట్‌కు వెళ్లి వస్తుండగా..

- డీసీఎంను ఢీకొట్టిన కారు
- తండ్రి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఫొటో షూట్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా తెనాలి మండలం నందులపేట గ్రామానికి చెందిన మల్లికార్జున్ వృత్తిరీత్యా ఫొటోగ్రాఫర్. ఓ సారీ ఫంక్షన్ ఆర్డర్ ఫొటోషూట్‌కు కొడుకు దీపక్‌సాయి మరో ఇద్దరు సహాయకులు అబ్దుల్ రావుఫ్, వీరవెంకట్‌తో కలిసి శంకర్‌పల్లిలోని త్రిపుర రిసార్ట్స్‌కి వెళ్లారు. షూట్ ముగించుకుని వారి సొంతకారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఎగ్జిట్ నంబర్ 12 వద్ద మొదటి లైన్‌లో వెళ్తున్న భారీ వాహనం నెమ్మదిగా వెళ్తుండడంతో ఆ వాహనాన్ని దాటవేసి పక్కలైన్‌లో వెళ్తున్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మల్లికార్జున్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా కుమారుడు, సహాయకులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.